# ఐ లవ్ యూ!

వి.సుజాత



ఇద్దరం డాబా మీద కూర్చున్నాం. రాత్రి ఎనిమిదవుతోంది. మామిడిచెట్టు, కొబ్బరిచెట్టు శిఖరాల మధ్య నించి పౌర్ణమి చంద్రుడు ప్రకాశవంతంగా కనిపిస్తున్నాడు. మేం కూర్చున్న కుర్చీలు పక్కపక్కనే ఉన్నాయి.

'సుజా!' అన్నాడు ప్రేమనాథ్.

అతని కంఠం ఎంత తియ్యగా ఉందో నేను వర్ణించలేను. మెల్లిగా అతనివైపు చూశాను. గుండ్రటి మొహం. పక్క పాపిడి క్రాపు. సన్నటి మీసాలు. అతని కళ్ళల్లో ఏదో ఆకర్షణ ఉంది.

ప్రేమనాథ్ నా చెయ్యి పట్టుకున్నాడు. నా కళ్ళల్లోకి ఆప్యాయంగా చూశాడు. మామిడిచెట్టు మీదనుంచి ఏదో పక్షి విచిత్రంగా పాడుతోంది. చల్లని గాలి వీస్తోంది.

'సుజా, మనం ఎప్పుడూ ఇలాగే ఉండాలి. ఈ లోకంలో ఎవ్వరూ మనల్ని విడదీయలేరు. ఎంతమంది ఎదిరించినా, లోకం ఒక్క కంఠంతో వద్దన్నా నేను నిన్నే పెళ్ళాడతాను. మన ప్రేమ చిరస్థాయిగా నిలవాలి!' అన్నాడు ప్రేమనాథ్.

నేను జవాబివ్వలేదు. నా గుండె దడదడ కొట్టుకుంటోంది. ఏదో చెప్పాలని నోరు తెరిచాను. కాని నోటమ్మట మాట రాలేదు. ప్రేమనాథ్ మాటలు వింటూంటే నా హృదయం ఆనందంతో నృత్యం చేస్తోంది. అతని వైపు చూస్తూ ఉండిపోయాను.

అతని వయస్సు ఇరవైఏళ్ళు. నాకంటె రెండేళ్ళు పెద్ద. గత సంవత్సరం నించీ ఇద్దరం కలుసు కుంటున్నాం. అప్పుడప్పుడు బీచ్‌కి, సినిమాలకి వెళ్తూ ఉంటాం.

'సుజా నువ్వు ఎప్పుడూ మౌనంగా ఉండిపోతావ్ నీ మౌనముద్ర గమనిస్తూ ఉంటే నేనొక పసపిట్టనేమో అనిపిస్తుంది.' అన్నాడు ప్రేమనాద్.

'ప్రేమ్, అలా అనకు నీలానూట్లాడే శక్తి నాకులేదు. నీ ఆలోచనలకు పదాలతో చక్కటిరూపాన్ని నువ్వు ఇవ్వగలవు. నేను మాట్లాడేకంటే నీమాటలు వింటూంటే ఎంతో హాయిగా ఉంటుంది.'

'సుజా!' ప్రేమనాద్ మెల్లిగా పిలిచాడు. నా చేతివేళ్ళను ఆప్యాయంగా ముద్దెట్టుకున్నాడు. అతని కుడిచెయ్యి నా భుజంమీద లాలనగా వాలింది. నా పొడుగాటి జడను పట్టుకుని కొంటెగా లాగాడు.

'సుజా, రేపు సినిమాకి వెళ్దామా?' అడిగాడు. నవ్వి ఊరుకున్నాను. ప్రేమనాద్ కుర్చీలోంచి లేచాడు. నేనూ లేచాను. నా కళ్ళలోకి తీక్షణంగా చూశాడు. అతని చూపులమూలంగా నా కనురెప్పలు అల్లల్లాడాయి.

'రేపు రెండింటికి వస్తాను. సిద్ధంగా ఉండాలి సుజా, కళ్ళకు బాగా కాటుక పెట్టుకో!'

'అలాగే' అన్నాను. ఇద్దరం మేడమెట్లు దిగాం. ప్రేమనాద్ వెనకనే గేట్‌వరకూ వెళ్ళాను. ఇద్దరం పేవ్‌మెంట్ మీద నిలబడ్డాం. రోడ్డుదీపాలు వెలుగుతున్నాయి కార్లు, లారీలు రోడ్డమ్మట స్పీడుగా వెళ్తున్నాయి.

'సుజా, నిన్ను విడిచి ఇంటికి వెళ్ళాలనిపించడంలేదు. కాని వెళ్ళక తప్పదు!'

'ప్రేమ్ !' అని ఊరుకున్నాను. వీధిదీపం కాంతిలో అతని ముఖం విచిత్రంగా కన్పిస్తోంది. కళ్ళు మెరుస్తున్నాయి. అతడి పెదిమలు ఎందుకో అల్లల్లాడుతున్నాయి. అతను చటుక్కున నా చెయ్యి పట్టుకున్నాడు. నా శరీరంలోకి ఏదో విద్యుచ్ఛక్తి ప్రవహించినట్లనిపించింది. క్షణకాలం నా వైపు చూసి గుడ్ నైట్ చెప్పి వెళ్ళిపోయాడు. దీపస్తంభం సమీపంలో అలాగే నిలబడి ఉన్నాను. అతను వెళ్ళిన వైపే చూస్తున్నాను. అతని రూపం దూరంలో అదృశ్యమైనదాకా నేను కదల్లేదు.

మేడ మెట్లెక్కాను. హాల్లోకి ప్రవేశించాను. పిల్లలందరూ వంటింట్లో అన్నం తింటున్నారు. నా అడుగుల చప్పుడు విని అమ్మ నన్ను భోజనానికి రమ్మంది. అమ్మ మాట నాకు వినిపించనట్టు గబ గబా డాబా మీదకు వెళ్ళాను. పక్క కుర్చీ ఖాళీగా ఉంది. కళ్ళు మూసుకున్నాను. ప్రేమ్‌నాథ్ రూపం నా మనోఫలకం మీద ముద్రించినట్టు కనిపిస్తోంది. అతని కంఠం శ్రావ్యంగా వినిపిస్తోంది. కళ్ళు తెరిచాను. పౌర్ణమి చంద్రుని ఆకాశయాత్ర సాగుతోంది. నక్షత్రాలు తళ తళ మెరుస్తున్నాయి. గతంలోంచి ఏవేవో సంఘటనలు నాకు జ్ఞప్తికొస్తున్నాయి.........

సంవత్సరం క్రితం...కాలేజీకి టైమయింది. పుస్తకాలు పట్టుకుని గబ గబా మేడ మెట్లు దిగుతున్నాను. బూట్ల చప్పుడు వినిపించింది. కిందనించి ఒక యువకుడు మెట్లెక్కుతున్నాడు. అతని ముఖంలో నవ్వు లేదు. సీరియస్గా ఉన్నాడు. నావైపు వోరగా చూసి తల దించుకుని గబాగబా కిందకు వెళ్ళిపోయాడు. నేను మెట్లుదిగి వీధి వైపు నడిచాను. ఒకప్పుడు అతనూ, నేనూ ఇంత దగ్గరవుతామని అప్పట్లో నేనూహించలేదు.

మా కాలేజ్ వార్షికోత్సవం జయప్రదంగా సాగుతోంది. ఫ్లడ్‌లైట్ల కాంతిలో నృత్యం చేసి ఉషారుగా గ్రీన్ రూమ్ చేరుకున్నాను. బయటి నుంచి నాన్న కంఠం వినిపించింది. గుమ్మం వద్దకు వెళ్ళాను. నాన్నవైపు నవ్వుతూ చూశాను. పక్కనున్న ఆ యువకుడి మీదకి నా దృష్టి మళ్ళింది. అతను మాట్లాడలేదు. కాని అతని కళ్ళు ఏదో సందేశాన్ని నాకు అందివ్వడానికి తాపత్రయ పడుతున్నాయి.

ఆరోజు ఆదివారం. తలంటుకుని నీళ్ళు పోసుకున్నాను. నా జుట్టు మహపొడుగ్గా ఉంటుంది. జుట్టు ఆరబెట్టుకుంటూ డాబామీద పచార్లు చేస్తున్నాను.

'అమ్మాయ్,' నాన్న పిలిచాడు.

నవ్వుతూ నాన్న కూర్చున్న గదిలోకి వెళ్ళాను. నాన్న ఒంటరిగా లేడని గ్రహించాను. నాన్న పక్కనే సోఫాలో చతికిల బడ్డాను. ఎదురుగా ఆ యువకుడు కూర్చుని ఉన్నాడు.

'అమ్మాయ్, ఇతని పేరు ప్రేమనాథ్. ఎమ్. ఎ. లిటరేచర్ చదువుతున్నాడు,' నాన్న పరిచయం చేశాడు.

ప్రేమనాథ్ వైపు చూసి 'నమస్తే' అన్నాను నవ్వుతూ.

'ప్రేమనాథ్, నాతో చెప్పినదంతా దీనితో చెప్పు' అన్నాడు నాన్న.

ప్రేమనాథ్ నా వైపు విచిత్రంగా చూశాడు. అతనిముఖంలో ఏదో భయం ఆదుర్దా గోచరిస్తున్నాయ్. క్షణకాలం మాట్లాడకుండా, తల దించుకుని

కూర్చుండబెట్టాడు.

'మరేం ఫర్వాలేదు—చెప్పు' అన్నాడు నాన్న.

ప్రేమనాథ్ మెల్లిగా నావైపు తిరిగాడు.

'సుజాతా' నిన్ను నేను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను మీ నాన్నగారితో అంతా చెప్పాను. బస్టాపుల్లో అమ్మాయిలతో రహస్యంగా మాట్లాడ్డం నా కిష్టంలేదు. అందుకే తిన్నగా ఇక్కడికొచ్చాను. రెండేళ్లలో నా ఎమ్. ఎ. పూర్తవుతుంది. నా కాళ్లమీద నిలబడ్డాక నిన్ను పెళ్లిచేసుకుంటాను. ఈ విషయంలో నీ జవాబుకోసం ఎదురు చూస్తున్నాను.' అన్నాడు ప్రేమనాథ్.

సిగ్గుతో నా బుగ్గలు ఎర్రబడ్డాయి. నేను ఏం జవాబిచ్చానో నాకే గుర్తులేదు. నాన్నమాటలు మాత్రం నాకు జ్ఞాపకం ఉన్నాయి.

'అమ్మాయి, నువ్వు వెంటనే జవాబివ్వలేవు. ఇద్దరూ కలుసుకోండి. మాట్లాడుకోండి. ఒకళ్లనొకళ్లు అర్థం చేసుకోండి. అటుపైన ఒక నిశ్చయానికి రావచ్చు, అన్నాడు నాన్న.

ఆనాటి రాత్రి నాకు నిద్రపట్టలేదు. ప్రేమనాథ్ ముఖం జ్ఞప్తికొస్తోంది ఏవేవో ఊహలు! ప్రేమరూపం ఎలా ఉంటుందో నాకు తెలియదు, అయినా ఏ స్వప్న సీమలోనో విహరిస్తున్నట్టు అనిపించేది. ఒక యువకుడు నా అందాన్ని

# ఐ లవ్ యూ

గుణాన్నిచూసి ప్రేమిస్తున్నాడు. పదిహేడేళ్ల యువతికి ఇదొక నూతన అనుభవం!

వారం రోజులు గడచిపోయాయి. ప్రేమ్‌నాథ్ మా ఇంటి కొచ్చాడు. నన్ను బీచ్‌కి తీసుకెళ్లాడు. ఇద్దరం సముద్ర పొడ్డున ఇసుకలో కూర్చున్నాం. సముద్ర కెరటాలు దూసుకుంటూ ముందుకి వస్తున్నాయి. అర్ధచంద్రుడు, బీచ్ దీపాలు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. నేను చాలా ఉత్సాహంగా ఉన్నాను. ఇంత కాలానికి ఒంటరిగా ఒక యువకుడితో బీచ్‌కి వెళ్లాను. నా హృదయం ఉరకలేస్తోంది. ప్రేమ్‌నాథ్ చూపుడు వేలుతో ఇసుకలో ఏదో రాసి నాకేసి చూశాడు.

'సుజా, నేనేం రాశానో చెప్పు,' అన్నాడు.

అర్ధచంద్రుడి కాంతిలో అతను రాసింది కనపడటం లేదు. కిల కిల నవ్వాను.

'నువ్వే చెప్పు!' అన్నాను.

'సుజా, కాంతివంతమైన నీ కళ్లతో చూస్తే నేను వ్రాసిన 'ఐ లవ్ యు' స్పష్టంగా కనిపిస్తుంది.'

అతని వైపు సూటిగా చూశాను. నలువైపులనుంచీ ఏవో ధ్వనులు వినిపిస్తున్నాయి. కెరటాల ముందు నిలబడి కాళ్లు కడుక్కుంటున్న పిల్లలు అరుస్తున్నారు.

మల్లెపూల పరిమళం మా సమీపంలో వ్యాపించింది. ప్రేమ్‌నాథ్ ఒక పెద్ద మల్లెపూల దండను కొని నా చేతికిచ్చాడు. జడలో తురుముకున్నాను.

'నువ్వు మల్లితీగలా ఉంటావు!' అన్నాడతను.

విశాలమయిన సముద్రంకేసి చూశాను. ఏదో ఓడ ప్రయాణం చేస్తోంది. ఓడ లైట్లు ప్రకాశిస్తున్నాయి. మల్లెపువ్వులా వున్నాననుంటే ఇంకా సంతోషించేదాన్ని.

'సుజా, మన ప్రేమ ఒక ప్రబంధంగా రూపొందాలి. మన ప్రేమ రోమియో, జూలియట్లను మరిపించాలి!' అన్నాడతను.

ఇంటికి తిరిగొచ్చేసరికి ఎనిమిదయింది. నన్ను ఇంట్లో అప్పగించి ప్రేమ్‌నాథ్ వెళ్లిపోయాడు.

మాసాలు దొర్లిపోయాయి. ఒకనాడు ఇద్దరం డాబా మీద కూర్చున్నాం. రెండు జడలు వేసుకున్నాను. ప్రేమ్‌నాథ్ నా వైపు సీరియస్‌గా చూశాడు.

'సుజా, నీరూపం బాగాలేదు. రెండు జడలు నాకు నచ్చవ్!' పిస్టల్లా మ్రోగిందతని కంఠం.

రెండుక్షణాలు అతని కళ్లల్లోకి తీక్షణంగా చూశాను. గబగబా లోపలికి వెళ్లాను. అమ్మ తొందరగా జడలువిప్పి అల్లింది. నవ్వుతూ డాబా చేరుకున్నాను. అతనిముఖం ఆనందంతో మెరిసింది. ప్రేమ్‌మాట నెగ్గాలి!

కాలేజీనుంచి ఇంటికి వస్తున్నాను. ప్రేమనాథ్ నా కోసం బస్టాపులో నిలబడ్డాడు. ఇద్దరం టాక్సీ ఎక్కాం. ఎక్సెంట్‌రోడ్డులో టాక్సీ దిగి ఓ హోటల్‌కి వెళ్లాం.

సర్వర్ రాగానే అతను ఆర్డరిచ్చాడు. నా వైపు నవ్వుతూ చూశాడు.

'నీ జాకెట్ మహా పల్చగా ఉంది. అవయవాలన్నీ కనిపిస్తున్నాయి!' ఆశ్చర్యంగా జాకెట్‌ని పరీక్షించుకున్నాను. ఎర్రటి టూబైటు గుడ్డ. అంత పల్చగా లేదు అతని ముఖంలో ఏదో బాధ!

'ప్రేమ్, ఇది అంత పల్చగా లేదే!' అన్నాను ధైర్యంచేసి.

'నీ మాత్రం నాకు తెలియదంటావా!' నేను జవాబివ్వలేను.

'సుజా, నువ్వు నా ఇష్టదేవతవి.



నిన్ను పూజిస్తున్నాను. నువ్వు జాగ్రత్తగా ఉండాలి, నీ అందాన్ని కప్పుకోవాలి పల్చటి దుస్తులు నీకు తగవు!'

ఆరోజు నాకు చాలాకోపం వచ్చింది. నాకు స్వేచ్ఛలేదు. అతను గీసిన గీతల మధ్య నేను పడిఉండాలి. అతని పాటకు తాళంవేయాలి! నేను తివాసీలా, గోనె గుడ్డలా ధరిస్తే అతను తృప్తిపడే వాడేమో!

మరో రోజు నేను నా స్నేహితురాలు సావిత్రిని చూడడానికి వెళ్ళాను. చటుక్కున బయట టాక్సీ ఆగింది. ప్రేమనాథ్, నా చెల్లెలు జయ సావిత్రి ఇంట్లోకి వచ్చారు. సావిత్రిని అతనికి పరిచయం చేశాను. అతనితోవెళ్ళి టాక్సీ ఎక్కాను. టాక్సీ కదిలింది.

'సుజా ఈ సావిత్రి ఎవరు?'

'నా క్లాస్ మేట్;'

'నువ్వు దానింటికి వెళ్ళొద్దు!'

'ఎందువల్ల?'

'దానిముఖం చూస్తే మంచిది కాదని పిస్తోంది.'

నాకు కోపం వచ్చింది. 'నువ్వు తప్ప మరెవ్వరూ మంచివాళ్ళే లేరంటావ్ ప్రేమ్,' అనుకున్నాను మనస్సుకి.

'సావిత్రి చాలా మంచిదీ,' అన్నాను.

'సుజా నువ్వు అమాయకురాలివి. మొహంచూసి మోసపోతున్నావ్. అది నిన్ను పాడుచేస్తుంది.' ఆలోచిస్తూ కూర్చున్నాను. అతను మినహా అందరూ నన్ను పాడుచేస్తారు!

'సుజా. నాచేతిలో చెయ్యివేసి చెప్పు—ఇటుపైన దాని ఇంటికి వెళ్ళనని.'

'వెయ్యలేను.' అన్నాను.

'సుజా, అలా అయితే ఇకమీదట నేనిక్కడికిరాను. నిన్ను కలుసుకోను'' అన్నాడు ప్రేమనాథ్.

బాధగా అతనివైపు చూశాను.

చేతిలో చెయ్యివేశాను. కాని చెప్పడానికి నోరు రాలేదు.

సావిత్రిది వెన్నలాంటి హృదయం. అతని తృప్తికోసం ఆమెను వదిలేయడం ఆత్మవంచన అవుతుంది!

అటుపైన కొంతకాలంపాటు ఇద్దరం కలుసుకోలేము.

ఒకనాడు అతనూ, నేనూ డాబామీద కూర్చున్నాం.

'సుజా, నీకు కోపం వచ్చిందా?'

'ఎందుకు?'

'సావిత్రి ఇంటికి వెళ్ళొద్దన్నందుకు.'

'లేదు. అయినా ప్రేమ్, నీకు సావిత్రి గురించి తెలీదు. ఆమె ఎంతో మంచిది. నా కోసం ప్రాణం ఇస్తుంది,' అన్నాను బాధగా.

అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. నా వేళ్ళని నిమురుతూ నా కళ్ళల్లోకి చూశాడు.

'సుజా, నన్ను క్షమించు నీకు ఎందరో స్నేహితు లున్నారు. నాకు నువ్వుతప్ప ఈలోకంలో ఎవ్వరూలేరు. నువ్వు లేకుండా నేను బ్రతకలేను. నా పెళ్ళి నీతోనే అవుతుంది. అలా కాకపోతే బ్రహ్మచారిగా ఉండిపోతాను. నా జీవితానికి ఉన్నది ఒకేబాట!'

ఆ క్షణంలో అతనిమాటలువిని ఎంతో ఆనందించాను. అతని సమక్షంలో యుగాలకొలబడి ఉండగలనని పించింది. ప్రేమనాథ్ అపూర్వ ప్రేమకు నేను అర్హురాలిని కాదేమో అనుకున్నాను.

కూర్చీలోంచి ఉలిక్కిపడి లేచాను.

'అమ్మాయ్' అన్నం తిన్నావా?' అంది అమ్మ.

అమ్మతో వంటింట్లోకి వెళ్ళాను. అమ్మా, నేనూ భోజనం చేశాం.

ఉగాది పండుగ కొత్తచీర కట్టుకుని వీధిలో నిలబడ్డాను. ప్రేమనాథ్ మెట్లెక్కి వచ్చాడు. నాకొక టెలిగ్రామ్ అందించాడు.

'విష్ యు ఎ హేపీ న్యూ ఇయర్—జాక్' అని ఉంది. టెలిగ్రామ్‌ని ప్రేమ్‌నాథ్‌కి అందించాను. అతను చదివి నావైపు సీరియస్‌గా చూశాడు.

'ఎవరితను?'

'నాకు తెలీదు.

'నీకు తెలినివాడు టెలిగ్రామ్ ఎలా పంపాడు?'

'నాపేరూ అడ్రసూ కనుక్కొని పంపి ఉంటాడు మీ మగాళ్ళకి అదోకష్టమా!' అన్నాను.

'వీడిమీద కేసుపెట్టాలి.'

'ఎందుకు?' అడిగాను అమాయకంగా.

'ఇలా ఎవరు టెలిగ్రామ్‌లు పంపినా నోరు మూసుకుని కూర్చుంటావా?'

'దాని మూలంగా నాకు పోయేదేమిటి?'

'ఆలోచించి కనుక్కో. నేను వెళ్ళొస్తాను!'

అతను మెట్లవైపు వడివడిగా అడుగు వేశాడు. వెళ్ళి చెయ్యి పట్టుకున్నాను.

'ఇవాళ ఉగాది మనం పోట్లాడుకో వద్దు!' అన్నాను.

'సుజా, ఈ జాక్ నీకెంత కాలంగా తెలుసు?

'అతడిని నేను చూడలేదు.'

'నేను నమ్మను!'

ప్రేమనాథ్ మెట్లుదిగాడు నేను ఆగ మనలేను. రోషావేశంతో లోపలికి పరిగెత్తాను. పరుపుమీద పడుకుని వెక్కి



పెక్కి ఏడ్చాను. ఉగాది పండుగనాడు కన్నీళ్లు కార్చవలసి వస్తుందని నేననుకోలేదు.

* * *

పదిరోజులు గడిచిపోయాయి. సాయంత్రం ఆరయింది. సంగీతం నేర్చుకుని బస్‌స్టాప్ చేరుకున్నాను. ప్రేమనాద్ నావైపు నవ్వుతూ చూశాడు క్షణంలో నవ్వు మాయమయింది.

'సుజాతా నీతో చాలా మాట్లాడాలి. ఏదేనా హోటల్ కెళ్దామా?'

'అక్కర్లేదు ఇంటికి నడిచివెళ్దాం. దార్లో మాట్లాడుకోవచ్చు' అన్నాను.

రోడ్డమ్మట ఇద్దరం పక్కపక్కనే నడుస్తున్నాం.

'సుజాతా, సంవత్సరంపాటు నువ్వు నవార్తవని ఆశించాను. కాని మనదోవలు వేరు. మనిద్దరం కలిసి జీవించడం సాధ్యంకాదు. మనం విడిపోదాం. నేను మా మేనత్తకూతుర్ని పెళ్లిచేసుకోవాలని నిశ్చయించు కున్నాను,' అని ఆగడతను. అతనివైపు అయోమయంగా చూశాను. నా గుండెల్లోకి ఒక్కసారి వెయ్యిబల్లాలు దిగినట్లనిపించింది. 'మొన్నటిదాకా అత్తకూతుర్లే లేరని చెప్పిన ప్రేమ్‌కి, ఇంతలోనే నో అత్తకూతురు ఏదివినుండి దిగివచ్చింది?' అని ఆశ్చర్యపోయాను.

'ప్రేమ్, నీకు కావలసినట్లు నేనుండగలను—మన పెళ్లయ్యాక!'

'నాకు నమ్మకంలేదు.'

'నాలో లోపాలుంటే చూపించు ప్రేమ్—దిద్దుకుంటాను.'

'దిద్దడం సాధ్యంకాదు. మరోజన్మ ఎత్తాలి.' మెల్లిగా నడుస్తున్నాం. నా కళ్లమ్మట నీళ్లు కారుతున్నాయి. తొలిప్రేమ బలమైన దన్నారు. ఇది అతనికి తొలిప్రేమ కాదేమో!

'ప్రేమ్, నీ మాటలు జ్ఞాపకమున్నాయా? మనప్రేమ రోమియో జూలియట్లను మరిపించాలి అన్నావ్! నువ్వు ఇంత హీనస్థితికి దిగజారుతావనుకోలేదు. ఇదేనా ప్రేమ!'

'సుజాతా, మనిద్దరికీ సరిపడదు.'

'మనం సరిపెట్టుకోవాలి నువ్వేలా ఉన్నా నేను సర్దుకుపోవడం లేదూ? ప్రేమకు పునాది త్యాగం, విశ్వాసం. నీ కోసం నేను ఏదైనా చేయగలను, వదలగలను. ప్రేమ్, నా మనస్సుతో ఆడకు 'మనప్రేమ చిరస్థాయిగా ఉండాలి!'

అతను వెటకారంగా నవ్వాడు.

'సుజాతా, నన్ను మర్చిపో!'

'అవసర మైనప్పుడు తప్పకుండా చేస్తాను ఆపని. ప్రేమ్, నువ్వు ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో బాధపడుతున్నావ్. నీ మంచి నన్నెవరో లాక్కుపోతారనుకుంటున్నావ్. చక్కని సిల్కు బట్టలు ధరిస్తే నా అవయవాలు కనపడతాయంటావ్. ముక్కూ, మొహమూ తెలియనివాడు పలకరిస్తే బెంగపెట్టుకుంటావ్. నా ప్రాణ స్నేహితురాలైన సావిత్రి ఇంటికెళ్లినా నువ్వు అనుమానిస్తావ్. నన్ను ఆరాధిస్తున్నావ్. పూజిస్తున్నావ్. ఇదేనా నీ ప్రేమ!'

మా ఇంటికి దగ్గరయ్యాం. అతను రోడ్డు మలుపులో ఆగాడు.

'సుజాతా, నువ్వు నీ ఇంటికి నేను ఈ రోడ్డమ్మట!' అన్నాడతను.

అతనివైపు కన్నీళ్లతో చూశాను. అతనిముఖం కారుమబ్బులు కమ్మినట్లుంది. కళ్లల్లో కాంతిలేదు.

మాసిన గెడ్డం.

'ప్రేమ్, ఇంకమనం కలుసుకోమా?'

'కలుసుకోవడం మంచిది కాదు.'

## ఇది మీకు తెలుసా?

* పంచదారకాని, సోడాగాని కూరలకి జతచేయకూడదు. ఉడికేటప్పుడు కొంచెం ఉప్పు కలిపితే చాలు.

* ఎంత తక్కువ వీలైతే అంత తక్కువ నీరు వాడాలి — కూరలు వండేటప్పుడు. ఉడికిన తరువాత నీళ్లు పారపోయకుండా ఏ చారుకో, సూపు చేయడానికో వాడవచ్చు.

* కూరగాయ లెప్పుడూ గట్టిగా మూతపెట్టి కలియపెట్టకుండా ఉడికించాలి.

'నేను చేసిన తప్పేమిటి?'

'నువ్వు నా కోసం జీవించలేవు. షికార్లమ్మట తిరుగుతూ ఉంటావ్. నీకు స్నేహితులు కావాలి. నీకు ఎన్నో కావాలి.'

'ప్రేమ్, నువ్వు పొరపడుతున్నావ్. నాకు నువ్వే కావాలి. నేను కాలేజీకి, సంగీతం క్లాసుకి తప్ప మరెక్కడికి వెళ్లడంలేదు. స్నేహితుల ఇళ్లకి అసలు వెళ్లడమే లేదు. ఇంకా ఏం చెయ్యాలో చెప్పు.'

'కాలేజీకి వెళ్లొద్దు. సంగీతం మానెయ్యి. ఇల్లు దాటి బయటకు కదలకు. ఆ జాన్‌గాడినిగురించి పోలీస్ రిపోర్టియ్యి. తుంటరి వెధవలకు బుద్ధి చెప్పాలి. అవయవాల వంపులు ప్రదర్శించే దుస్తులు ధరించకు!'

'ప్రేమ్, నన్ను జైల్లో కూర్చోమంటావ్!' అన్నాను.

'నువ్వు నన్ను ప్రేమిస్తే రాతిగోడలు జైలు కాలేవు!'

అతనివైపు తీక్షణంగా, అసహ్యంతో చూశాను. అది నా ఆఖరి చూపు!

'ప్రేమ్, నీకు పిచ్చి. బానిసత్వంలో ప్రేమ నిలవదు, పెరగదు. స్వేచ్ఛతో ఆప్యాయతతో హృదయాలు అతుక్కుని లీనమవుతాయి. వెళ్లు, నీ ఆదర్శాలను పట్టుకుని వేళ్లాడుతూ సుఖంగాజీవించు!' అన్నాను. గిరుక్కున వెనక్కుతిరిగి మా ఇంటివైపు నడవసాగాను.

వీధిదీపాలు వెలుగుతున్నాయి. ప్రజలు నడుస్తున్నారు. కార్లు దూసుకు పోతున్నాయి. నా హృదయాన్ని ఏదో అంధకారం ఆవరించింది. నా కళ్ళు చెమ్మగిల్లాయి మేడమెట్లెక్కాను. నాగది చేరుకున్నాను. టాయిలెట్ టేబిల్ మీదున్న ప్రేమనాద్‌ఫోటో నన్ను వెక్కిరిస్తున్నట్టు చూసింది. పరుపుమీద వాలాను.

ఆకలిలేదు రాత్రి పరుపుమీద దొర్లుతూ ఉండిపోయాను. గదిలో చీకటి. ఏదో చప్పుడయి కింద కురికాను. లైట్‌స్విచ్ నొక్కాను. నల్లపిల్లి టాయిలెట్ టేబుల్ మీదనించి కిటికీవైపు దూకింది.

ప్రేమనాద్ ఫోటో గచ్చునేలమీద పడి, అద్దం తునాతునకలైంది!

బలమైన తొలిప్రేమ — బూడిదలో పోసిన పన్నీరైంది.